నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, గురువారం 4 జూలై 2024 | KARIMNAGAR




ఖని చౌరస్తాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

# గనుల వేలంపై ఆగ్రహజ్వాల

- కదంతొక్కిన సింగరేణి కార్మికులు
- టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళన
- గనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం

గోదావరిఖని, జూలై 3: నల్లనేల వేడెక్కుతున్నది. బొగ్గు బ్లాకులను వేలం వేయాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా సింగరేణి కార్మికుల ఆందోళనతో అట్టుడికిపోతున్నది. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 1న అన్ని బొగ్గు గనులపై కార్మికుతో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన చేపట్టగా, బుధవారం సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ 1,2,3లో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆందోళన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ దిష్టి బొమ్మలు దహనం చేశారు. గోదావరిఖని చౌరస్తాలో టీబీజీకేఎస్ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డెపెల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి కార్మికులు, నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఇక రామగుండం డివిజన్-2లోని యూనియన్ కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ ఆర్జీ-2 డివిజన్ ఉపాధ్యక్షుడు అయిలీ శ్రీనివాస్, సెంటినరీకాలనీలోని తెలంగాణ చౌరస్తాలో టీబీజీకేఎస్ ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం చేశారు.

### అడ్డుకొని తీరుతం

కాంగ్రెస్, బీజేపీ పెట్టుబడిదారులతో కుమ్మకై బొగ్గు గనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు వేగంగా పనిచేస్తున్నయి. బొగ్గు గనుల ప్రైవేటీకరణను కాంగ్రెస్ ప్రారంభిస్తే.. ఖనిజ సంపదను సంపన్న వర్గాలకు కారు చౌకగా వెలికి తీసుకునేందుకు మోడీ నేతృత్వంలో బీజేపీ చట్టాలను రూపొందించింది. తెలంగాణలోని బొగ్గు నిక్షేపాలను సింగరేణి సంస్థ మాత్రమే తవ్వి తీయాలి. ఇతర ఏ ప్రైవేట్ వ్యక్తులకు గనులను కేటాయించినా అడ్డుకొని తీరుతం. తెలంగాణ ప్రజలకు ఉపాధినిచ్చే సింగరేణి సంస్థను కాపాడుకోవడానికి కార్మిక సంఘాలు, ప్రజలు, రాజకీయ పార్టీలు తమ విభేదాలను మరిచి ఐక్యంగా ముందుకు రావాలి.

- మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు



పెద్దపల్లి రూరల్: పెద్దకల్వాల ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావు

# నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలి

రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పెద్దపల్లిరూరల్, జూలై 3: అధికారులు, సిబ్బంది జవాబుదారీ తనంతో పనిచేయాలని, వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. మంథని అటవీ ప్రాంతమైనందున పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించి విరివిగా మొక్కలు నాటాలని నిర్దేశం చేశారు. బుధవారం పెద్దపల్లి మండలం పెద్దకల్వాల గర్ల్స్ వెల్ఫేర్ హాస్టల్, కాలేజీ గ్రౌండ్ ఆవరణలో ఎమ్మెల్యే విజయరమణారావు, అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం లెక్కల కోసం మొక్కలు నాటవద్దని, సంరక్షించి పెద్దచేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి, కేశోరాం సిమెంట్స్, రైస్‌మిల్లుల సిబ్బందిని వనమహోత్సవంలో భాగస్వాములను చేయాలని కోరారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్టీవో రవీందర్, డీఎఫ్‌వో శివయ్య, జడ్పీ సీఈవో నరేందర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య, జడ్పీటీసీ బండారి రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ పాల్గొన్నారు.



సొసైటీ చైర్మన్ నవీన్‌రెడ్డితో కలిసి గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

# ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

- రైతులను ఆదుకోవాలి
- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల
- మెట్లచిట్టాపూర్‌లో పీఏసీఎస్ గోదాం ప్రారంభం

మెట్‌పల్లి రూరల్, జూలై 3: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ డిమాండ్ చేశారు. మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌లో ₹13 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ గోదాంను బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. రైతుబంధు స్థానంలో రైతు భరోసా అమలు చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని, పెట్టుబడి సాయం అందక రైతులు దిక్కులు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వమైనా రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఎంపీపీ మారు సాయిరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు కేసీరెడ్డి నవీన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గోపిడి జగన్మోహన్‌రెడ్డి, సీఈవో తిరుపతి, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్ బద్ధం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# వేములవాడ ఏఎస్పీగా శేషాద్రినీ రెడ్డి బాధ్యతల స్వీకరణ



వేములవాడ, జూలై 3: వేములవాడ పోలీస్ సబ్ డివిజన్ ఏఎస్పీగా శేషాద్రినీ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వేములవాడ టౌన్, వేములవాడ రూరల్, చందుర్తి సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు మారుతి, పృధ్వీధర్ గౌడ్, అశోక్, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

ఆర్టీసీ పట్టణప్రాంతాలకే పరిమితమవుతున్నది. పలు కారణాలు చూపుతూ మారుమూల ప్రాంతాల్లో సర్వీసులను కట్ చేస్తున్నది. ఫలితంగా పల్లెల్లోని పేద విద్యార్థుల చదువు మిథ్యగా మారుతున్నది. మెజార్టీ గ్రామాలకు బస్సు సౌకర్యం నిలిపివేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాల్లోని బడులకు వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నారు. కొందరు ఐదారు కిలో మీటర్లు నడుచుకుంటూ వస్తుండగా, మరికొందరు సైకిళ్ల మీద, ఇంకొందరు ఆటోల్లో వెళ్తున్నారు.



పెద్దపల్లి మండలం సబ్బితం నుంచి రొంపికుంట స్కూల్‌కు సైకిళ్లపై వెళ్తున్న విద్యార్థులు

# బడి రూట్‌లో బస్సు బంద్!

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రతి ఊరుకు సేవలు విస్తరిస్తున్నామని, ఫ్రీ బస్సుతో ప్రజలకు చేరువవుతున్నామని ప్రకటనలతో ఊదరగొడుతున్న ఆర్టీసీ, మారుమూల గ్రామాలపై వివక్ష చూపుతున్నది. రోడ్లు బాగాలేవని, రాబడిలేదని బస్సులకు బ్రేక్ వేస్తుండగా, పిల్లల చదువులకు సంకటం ఏర్పడుతున్నది. విద్యార్థులు నిత్యం ఐదారు కిలోమీటర్ల మేర సైకిళ్లు, కాలినడక వెళ్తున్నప్పటికీ అది శ్రమకు మించిన భారం కావడంతో ఆరోగ్యం దెబ్బతింటున్నది. ఆటోలు నడుస్తున్నా చార్జీల స్థోమత లేక పేద కుటుంబాలు తల్లడిల్లుతుండగా, పిల్లలు చదువును మధ్యలోనే ఆపేయాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్వీసులు పునరుద్ధరించాలని విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి డిమాండ్ వ్యక్తమవుతున్నది.

- మారుమూల పల్లెలకు ఆర్టీసీ సర్వీసులు కట్
- పలువురు సైకిళ్లు, కాలినడకనే ప్రయాణం
- రోజూ ఐదారు కిలోమీటర్లు నడకతో యాతన
- ఆటోలు నడుస్తున్నా.. చార్జీల స్థోమత లేక అవస్థలు
- తల్లిదండ్రుల్లో ఆందోళన.. బడి మానేస్తున్న పిల్లలు
- బస్సులు నడపాలని స్టూడెంట్ల వేడుకోలు



నాగారం నుంచి రొంపికుంట స్కూల్‌కు ప్రమాదకర పరిస్థితుల్లో ఆటోలో వస్తున్న విద్యార్థులు

పెద్దపల్లి కమాన్, జూలై 3: పెద్దపల్లి జిల్లాలో 539 మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా, 26,215 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. అందులో సుమారు 16 వేల మంది విద్యార్థులు మారుమూల ప్రాంతాల నుంచి సైకిళ్లు, కాలినడక, ఆటోల్లో స్కూళ్లకు వస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి సబ్బితం, రొంపికుంట గ్రామాల మీదుగా గోదావరిఖని వరకు గతంలో ఆర్టీసీ బస్సు నడిచేది. రంగాపూర్, సబ్బితం, పేరపల్లి విద్యార్థులు రొంపికుంట జడ్పీ ఉన్నత పాఠశాలకు, ఎల్కపల్లి, గుంటూరుపల్లి, లక్ష్మీపురం విద్యార్థులు ఎఫ్‌సీఐ జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి చదువుకునే వారు. అయితే పలు కారణాలతో పెద్దపల్లి నుంచి సబ్బితం మీదుగా గోదావరిఖనికి బస్సు నడవడం లేదు. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. రొంపికుంట జడ్పీహెచ్ఎస్‌లో సుమారు 250 మంది అభ్యసిస్తుండగా, అందులో 160 మంది ఇతర గ్రామాల నుంచి సైకిళ్లపై, కొందరు డబ్బులు పెట్టుకొని ఆటోల్లో వస్తున్నారు. ఇక ఎఫ్‌సీఐ జడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు 90 మంది అభ్యసిస్తుండగా, అందులో 50 మంది ఇతర గ్రామాల నుంచి సైకిళ్లు, కాలినడకన వస్తున్నారు. అలాగే పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట, ముత్తారం, ధర్మాబాద్ గ్రామాల నుంచి జిల్లా కేంద్రంలో జడ్పీహెచ్ఎస్ (బాలుర), జడ్పీహెచ్ఎస్ (బాలికల) పాఠశాలలకు విద్యార్థులు సైకిళ్లు, ఆటోల్లో వచ్చి చదువుకుంటున్నారు. సుదూర ప్రాంతాలకు కాలినడకన, సైకిళ్లపై రోజూ వెళ్తుండడంతో పిల్లలకు అనారోగ్య సమస్యలూ తలెత్తుతుండగా, ఆటోల్లో వచ్చేవారికి చార్జీల భారం ఎక్కువైపోతున్నది. దీంతో మెజార్టీ పిల్లలు చదువులు మధ్యలోనే మానేయాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకుని మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు నడిపించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

### బస్సు లేక ఆటోలో వస్తున్న..



మాది పెద్దపల్లి మండలం రంగాపూర్. నేను రొంపికుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న. మా ఊరి నుంచి రొంపికుంటకు బస్సు లేకపోవడంతో ప్రతి రోజు ఆటోలో వస్తున్న. నెలకు రూ.1200 కిరాయి కడుతున్న. బస్సు ఉంటే మాకు ఈ డబ్బులు మిగిలేవి. స్కూల్ దూరంగా ఉండడంతో ఆటోలో రావాల్సి వస్తుంది. అధికారులు మా స్కూల్ రూట్‌లో బస్సు నడిపించాలి.

- బీ శ్రీవర్షిణి, జడ్పీహెచ్ఎస్ (రొంపికుంట)

### మా ఫ్రెండ్స్ మానేసిన్రు



మాది కమాన్‌పూర్ మండలం నాగారం. నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న రొంపికుంట బడిలో తొమ్మిదో తరగతి చదువుతున్న. బస్సు సౌకర్యం లేక రోజూ సైకిల్ పైన స్కూల్‌కు వస్తున్న. వానకాలంలో సైకిల్ పైన రావడం ఇబ్బందైతంది. బస్సు లేకపోవడంతో మా ఫ్రెండ్స్ కొందరు స్కూల్‌కు రావడం మానేసిన్రు. మా ఊరికి బస్సు వేసి మా కష్టాలను తొలగించాలి.

- టీ అలేఖ్య, జడ్పీహెచ్ (రొంపికుంట)

### నేను మా తమ్ముడు ఒకే సైకిల్‌పై వెళ్తున్నం



మాది పెద్దపల్లి మండలం సబ్బితం. నేను రొంపికుంట జడ్పీ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న. మా ఊరి నుంచి రొంపికుంట పాఠశాలకు వెళ్లే రూట్‌లో బస్సు సౌకర్యం లేదు. దీంతో మా తమ్ముడు నేను రోజూ ఒకే సైకిల్ పైన వెళ్తున్నం. మా ఊరికి పాఠశాలకు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇద్దరం కలిసి ఒకే సైకిల్ మీద రావడం చాలా కష్టం అవుతుంది. ఆటో వస్తమంటే చార్జీలు బాగా అడుగుతున్నరు. బస్సులు లేక కొందరు పాఠశాలలకు రావడం లేదు. మా రూట్‌లో బస్సులు వేయిస్తే మేమందరం బస్సులో వెళ్లి చదువుకుంటం.

- బీ అభివర్ధన్, జడ్పీహెచ్ఎస్ (రొంపికుంట)

### కాళ్ల నొప్పులు వస్తున్నయి



మాది పాలకుర్తి మండలం ఎల్కలపల్లి. నేను ఎఫ్‌సీఐ జడ్పీ పాఠశాలలో ఏడో తరగతి చదువుకుంటున్న. మా ఇంటి నుంచి స్కూల్ వరకు దాదాపు కిలోమీటర్ల దూరం ఉంటుంది. బస్సు సౌకర్యం లేక కాలినడకనే వస్తున్న. అప్పుడప్పుడు ఎవరైనా బైక్‌పైన లిఫ్ట్ సాయంతో వస్త. మా రూట్‌లో బస్సు ఉంటే బాగుండేది. రోజూ అంత దూరం నడుచుకుంటూ వస్తుండడంతో కాళ్ల నొప్పులు వస్తున్నయి. మాకు బస్సు వేయిస్తే మంచిగా ఉంటది.

- కే కార్తీక్, జడ్పీహెచ్ఎస్ (ఎఫ్‌సీఐ)



వీణవంక: రామకృష్ణాపూర్ నుంచి వీణవంకలోని ప్రాథమిక పాఠశాలకు నడిచి వెళ్తున్న విద్యార్థులు

### వీణవంక మండలంలో ఆరు గ్రామాలకు నో బస్

వీణవంక, జూలై 3: వీణవంక మండలంలోని మెజార్టీ గ్రామాలకు ఆర్టీసీ బస్సు నడపడం లేదు. ఇప్పలపల్లి, బ్రాహ్మణపల్లి, మల్లన్నపల్లి, రామకృష్ణాపూర్, లస్మక్కపల్లి, నర్సింహులపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేక 150 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు కాలినడకన, మరికొందరు సైకిళ్లపై నిత్యం రెండు మూడు కిలోమీటర్లు వెళ్తున్నారు. ఆటోలు ఉన్నా ఆర్థిక భారం ఎక్కువవుతుండడంతో తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి బస్సు సర్వీసు వేయాలని కోరుతున్నారు.

# అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపాం



జడ్పీ చైర్పర్సన్ అరుణకు జ్ఞాపికను అందజేస్తున్న పాలకవర్గ సభ్యులు

- అధికారులు, పాలకవర్గం సహకారం మరువలేనిది
- సిరిసిల్ల జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- చివరి సమావేశంలో పాలకవర్గానికి ఘన సన్మానం

రాజన్న సిరిసిల్ల, జూలై 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ మార్గదర్శనంలో సిరిసిల్ల జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపామని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ ఉద్ఘాటించారు. అధికారులు, పాలకవర్గం కృషి, గత సర్కారు విరివిగా నిధులు విడుదల చేయడంతో జిల్లా పరిషత్‌కు జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు దక్కిందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులకు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆమె అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లా డుతూ కొత్తగా ఏర్పడిన జిల్లాకు తొలి అధ్యక్షురాలిగా ఉండి ప్రజలకు సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. తనను నమ్మి ఇంత పెద్ద బాధ్యత అప్పగించిన కేసీఆర్, కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీగా అవకాశం ఇచ్చిన కోనరావుపేట మండల ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ.. పదవులు శాశ్వతం కాదని, మనం చేసిన సేవలే చిరకాలం గుర్తుంటాయని అన్నారు. అధికారులు, పాలకవర్గ సభ్యుల సమష్టి కృషి వల్లనే జిల్లాకు ఉత్తమ అవార్డు వచ్చిందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, జడ్పీటీసీలు గుండం నర్సయ్య, ఉమ, గట్ల మీనయ్య, నాగం కుమార్, మ్యాకల రవి, ఏషవాణీ, చీటి లక్ష్మణ్‌రావు, గుగులోత్ కళావతి, విజయ, కోఅప్షన్ సభ్యులు చాంద్‌పాషా పాల్గొన్నారు.

### సభ్యులకు సన్మానం

జడ్పీ పాలకవర్గ పదవీ కాలం గడువు ముగుస్తున్నందున చైర్‌పర్సన్ అరుణతో పాటు సభ్యులందరిని ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళ, రామతీర్థపు మాధవి, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహరావు, బీఆర్ఎస్ జిల్లా, పట్టణ అధ్యక్షులు తోట ఆగయ్య, జిందం చక్రపాణితో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

### గ్రూప్-2 గ్రాండ్ టెస్ట్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

కమాన్ చౌరస్తా, జూలై 3: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ -2 గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లికి చెందిన అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ లో ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 8, 9, 15, 16, 22, 23, 30, 31 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు అలాగే, మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 3 : నిరుద్యోగ ఎస్సీ యువతకు తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణ అందిస్తు న్నామని తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెం టర్ ఫర్ నర్సెస్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూ డు నెలల కాల వ్యవధిలో జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, డయాలసిస్ టెక్నీషియన్ కోర్సుల్లో నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న ఇంటర్ ఉత్తీర్ణులైన యువత శుక్రవారం లోగా తమ దరఖాస్తులను 9848581 100, 905990 2355 నంబర్లకు వాట్సాప్‌లో పంపించాలని సూచించారు.

### పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూలై 3: పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెండేండ్ల పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశానికి నోటిఫికేషన్ జారీ చేశారని పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ అనిన్ పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, తెలంగాణ పాలిసెట్-24లో ఉత్తీర్ణులైన (ఎంబీఐపీసీ) విద్యార్థులు అర్హులని చెప్పారు. ఈ యూనివర్సిటీ పరిధిలో నాలుగు పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయని, మహబూబ్‌నగర్, మామునూర్ (హను మకొండ జిల్లా), సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలో మొత్తం 110 సీట్లు ఉన్నాయని చెప్పారు. పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ రంగంలో వెటర్నరీ అసిస్టెంట్, ప్రైవేట్‌లో డెయిరీ ఫార్మ్, పౌల్ట్రీ ఫార్మ్ పెట్ హాస్పిటళ్లలో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు విశ్వవిద్యాలయం . edu.in లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, జూలై 20 లోగా యూనివర్సిటీలో దరఖాస్తు చేయాలని సూచించారు.

### ఫేక్ యాప్.. ₹5 లక్షలమోసం

కథలాపూర్, జూలై 3 : సైబర్ మోసాలపై పోలీసులు పదే పదే హెచ్చరిస్తున్నా.. అవగాహన కల్పిస్తున్నా కేటుగాళ్ల వలలో చిక్కుకుంటూనే ఉన్నారు. ఆశకు పోయి నిండా మునుగుతున్నారు. ఇలానే తక్కువ ధరకు నాణ్యమైన ప్రముఖ కంపెనీ సిమెంట్ వస్తుందని ఓ వ్యక్తి.. ఫేక్ యాప్ వలకు చిక్కాడు. ఐదు లక్షలు సమర్పించిన తర్వాత మోసపోయానని గ్రహించి లబోదిబోమన్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన వ్యక్తి ఓ భవనం నిర్మాణం కోసం సిమెంట్ అవసరం కావడంతో ఆన్‌లైన్‌లో ఓ ప్రముఖ కంపెనీ సిమెంట్ యాప్ కోసం వెతికాడు. ఈ క్రమంలో ఫేక్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులోనే చాటింగ్ చేశాడు. డబ్బులు ముందుగా చెల్లిస్తే సిమెంట్ పంపిస్తామని నమ్మించడంతో నిండా మునిగాడు. వారం క్రితం మొదటగా ₹100 పంపాడు. అది ఒకే కావడంతో ₹లక్ష, మళ్లీ ₹2 లక్షలు పంపించాడు. అయితే సిమెంట్ బస్తాల లారీ లోడ్ కావాలంటే ₹5 లక్షలు పూర్తిగా చెల్లించాలనడంతో మరో ₹2 లక్షలు పంపాడు. అయినా సిమెంట్ బస్తాలు రాకపోవడంతో మోసపోయాయని బాధితుడు గుర్తించాడు. బుధవారం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

### ఆరుగురు ఖైదీలకు విముక్తి

రాంనగర్, జూలై 3: వివిధ నేరాల్లో జీవిత ఖైదీలుగా కరీంనగర్ సబ్‌జైలులో ఉన్న ఆరుగురికి బుధవారం విముక్తి లభించింది. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన ముచ్చె మధు, ముచ్చె ఆశయ్య, ముచ్చె గంగయ్య, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ముస్తాక్ అహ్మద్, జగిత్యాల జిల్లాకు చెందిన సయ్యద్ జుబేర్, కరీంనగర్‌కు చెందిన పవార్‌రాజ్‌ను కొన్ని నెలల కిందటే క్షమాభిక్షకు అర్హులుగా గుర్తించారు. గత జనవరి 26 సందర్భంగా విడుదల చేయాల్సి ఉండగా, జాబ్‌మేళా నిర్వహించి ఉపాధి కల్పించాల్సి ఉండడంతో వాయిదాపడ్డది. బుధవారం వీరిని హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించారు. అక్కడ జాబ్‌మేళా నిర్వహించి ఉపాధి కోసం ఎంపిక చేశారు. అనంతరం విడుదల చేశారు.